క్లుప్తంగా

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

గార్లదిన్నె: కమలాపురంలో శనివారం గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఉచిత ఆధార్ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ ఇల్లూరు, కల్లూరులో ఆధార్ క్యాంపును పరిశీలించారు.

పాఠశాలలకు వంట పాత్రల సరఫరా



వంట పాత్రలను హెచ్‌ఎంలకు అందిస్తున్న డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి

శింగనమల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం వంట పాత్రలు సరఫరా చేసిందని డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు వంట సామగ్రి, స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. వాటిని ఎండీయూ ఆపరేటర్లు తమ వాహనాల్లో పాఠశాలలకు చేరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట సామగ్రిని వంట ఏజెన్సీ నిర్వాహకులు, స్పోర్ట్స్ కిట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈఓ నరసింహరాజు, ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమృత కలశయాత్రకు వలంటీర్లు



కలశాలతో బయలుదేరుతున్న వలంటీర్లు

గుంతకల్లు: నా భూమి– నాదేశం కార్యక్రమంలో భాగంగా అమృత కలశయాత్రకు జిల్లా వలంటీర్లు బయలుదేరారు. ఈ నెల 30, 31వ తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, గుత్తి తదితర ప్రాంతాలకు చెందిన దాదాపు 65 మందికిపైగా వలంటీర్లు పాల్గొననున్నారు. శుక్రవారం గుంతకల్లు నుంచి పలువురు కలశాలతో ధర్మవరం వెళ్లారు. ధర్మవరం నుంచి విజయవాడకు వెళ్లి అక్కడి నుంచి ప్రత్యేక రైలులో ఢిల్లీ వెళ్లనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన కలెక్టర్ గౌతమి, డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్, సీనియర్ డీసీఎం మనోజ్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

గజ వాహనంపై శ్రీవారు



గజ వాహనంపై చింతలరాయుడి విహారం

తాడిపత్రి అర్బన్: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష్మీచింతల వెంకటరమణ స్వామి గజవాహనంపై విహరించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని గజ వాహనంపై ఉంచి ఊరేగించారు. శనివారం స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల అనంతపురంలో ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అండర్–14 బాలుర విభాగంలో బాక్సింగ్ పోటీలు ఏర్పాటు చేయగా మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రదీప్, హర్షవర్ధన్, జగన్‌మోహన్, మహేంద్ర, చరణ్‌కుమార్, శ్రీరామ్, శరత్‌కుమార్, షాకీర్, దినేష్, అండర్ –17 బాలికల విభాగంలో స్నేహలత, 10 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. నవంబర్ మొదటి వారంలో విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. పీఈటీ వెంకటేష్‌ను, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

జగనన్నకు దీవెనలు అందించండి

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి
- 23 వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపి వారి ముఖాల్లో చిరునవ్వులు విరబూయించిన సీఎం జగనన్నకు మీ చల్లని దీవెనలందించాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్ ప్రాతినిధ్యం వహిస్తున్న 23వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్ ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అర్హత ఉన్నా సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను నమోదు చేసుకున్నారు. గత ప్రభుత్వంలో రద్దయిన ఇళ్ల స్థలాలిప్పించాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. మీ అందరి ఆశీర్వాదంతో మళ్లీ జగనన్న ప్రభుత్వం రాగానే ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలిప్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మున్సిపాల్టీ పరిధిలో ప్రజలు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న చేసిన మేలును మరవకుండా మళ్లీ ఆశీర్వదించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న మరోసారి ప్రజల్ని మోసం చేసేందుకు అబద్ధపు హామీలతో ఇళ్లవద్దకు వస్తున్న టీడీపీ, జనసేన పార్టీల నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు మైమూన్, నైరుతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత మంజునాథరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ జమీల్, కమిషనర్ మల్లికార్జున, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజనేయులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధశాఖల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం



హెచ్చెల్సీలో గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: మండలంలోని రైతులకు సాగునీరు అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. మిడుతూరు గ్రామం వద్ద హెచ్చెల్సీలో సాగునీరు రావడంతో శుక్రవారం ఆయన గంగపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను మోసం చేయడం జేసీ సోదరులకే చెల్లునన్నారు. శుక్రవారం జేసీ సోదరులు హెచ్చెల్సీ కార్యాలయం వద్దకు వెళ్లి సాగునీరు అందించాలని కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మండలానికి సాగునీరు వచ్చిన సంగతి మరిచిపోయి కార్యాలయాల వద్దకు వెళ్లడం వారి పిచ్చికి నిదర్శమన్నారు. తమది రైతుల ప్రభుత్వమని, అన్నదాతలకు ఎలాంటి అన్యాయం జరగకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూసుకుంటారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, యువజన విభాగం మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు పుట్లూరు కృష్ణారెడ్డి, మిడుతూరు సర్పంచ్ రామాంజులరెడ్డి, గోపి, నాగరాజు, శేఖర్, చిట్టూరు నాగభూషణ, దిమ్మగుడి మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, కొండూరు దేవమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ఏ.తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించిన వెంకటరమణారెడ్డి ఏ.తిమ్మాపురం లక్ష్మిరెడ్డి, గూడూరు చిన్న ఓబుళరెడ్డి, గూడూరు సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ వేణుగోపాల్‌యాదవ్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజారెడ్డి, ఆదినారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ గోవర్ధన్, గోపాల్ రెడ్డి, లక్ష్మంపల్లి హరినాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరావు, చంద్రశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు



తాడిపత్రిలో జెండా ఊరేగిస్తున్న ముస్లింలు

గుత్తి రూరల్: టి.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం గ్యార్మీ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని మహబూబ్ సుబహానీ జెండా కట్ట వద్ద ముజావర్లు ప్రత్యేక ఫాతేహాలు చేశారు. భక్తులు జెండాకట్ట వద్ద చక్కెర చదివింపులు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంజునాథ్‌రెడ్డిని శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జెండాకట్ట వద్ద అన్నదానం నిర్వహించారు. గ్రామస్తులు ఎన్‌సీ.రంగయ్య, రామచంద్ర, ఈశ్వర్, రజనీకాంత్, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్ పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: గ్యార్మీ వేడుకలను పట్టణంలోని ముస్లింలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు స్థానిక జెండా కట్టలను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, డప్పు సన్నాయి వాయిద్యాల నడుమ పట్టణ వీధుల్లో గ్యార్మీ జెండా ఊరేగించారు. స్థానిక టైలర్స్‌కాలనీలోని జెండా కట్ట వద్ద ఎమ్మెల్యే పెద్దారెడ్డి తనయుడు యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రూరల్ పరిధిలోని రమేష్‌రెడ్డి కాలనీలోని జెండా కట్ట నిర్వహించిన గ్యార్మీ వేడుకలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

యాడికి: మండల కేంద్రంతో పాటు రాయలచెరువులో శుక్రవారం దస్తగిరి(మహబూబ్ సుబహానీ) కట్ట వద్ద ముస్లింలు గ్యార్మీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక చెన్నకేశవ స్వామి కాలనీలో ఉన్న దస్తగిరి కట్ట వద్ద నుంచి జెండాలను ప్రత్యేకంగా పూలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

హుండీ కానుకల లెక్కింపు

శింగనమల: మండలంలోని శివపురం పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం హుండీ కానుకలు లెక్కించారు. మొత్తం రూ.3,20,678 ఆదాయం వచ్చినట్లు ఈఓ శోభ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

టౌన్ బ్యాంక్ ఎన్నికలు ఏకగ్రీవం

గుత్తి: గుత్తి కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. నామినేషన్ల ఉప సంహరణ తర్వాత మొత్తం 12 డైరెక్టర్ పదవులకు 12 మంది బరిలో నిలిచారు. దీంతో ఎన్నికల అధికారి బండి సత్యనారాయణ రెడ్డి నామినేషన్ వేసిన అబ్దుల్ జిలాన్, అంగడి నాగరాజు, స్టోర్ నాగరాజు, నాగరంగప్రసాద్, వెంకటేష్, వెంకటేష్‌బాబు, రాము, కృష్ణ, దాదా, మధుసూదన్ గుప్తా,వీరన్న, మాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. శనివారం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగనున్నాయని ఎన్నికల అధికారి ప్రకటించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెద్దపప్పూరు: అనుమతి లేకుండా పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం సాయంత్రం సెబ్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు యాడికి చెందిన పులిచెర్ల చంద్రమౌళి, చల్లా పెద్దిరాజు,పెద్దపప్పూరు మండలం సుంకేసులపల్లికి చెందిన గంగాధర్‌రెడ్డిని అరెస్ట్ చేసి ట్రాక్టర్లను పోలీసులకు అప్పగించినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

అన్నదాన షెడ్డు ప్రారంభం



అన్నదాన షెడ్డును ప్రారంభిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

యాడికి: రామరాజుపల్లెలోని బ్రహ్మంగారి గుడిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సొంత డబ్బు రూ.2 లక్షలతో నిర్మించిన అన్నదాన షెడ్డును ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన భక్తులకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గ్రామానికి చెందిన బాలసుంకన్నను పరామర్శించారు. వైద్య ఖర్చులకు రూ.10 వేలు నగదు అందించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, డీసీఎంఎస్ సభ్యుడు వేలూరు జగదీష్, నాయకులు నాగేష్, రంగనాయకులు రెడ్డి, మనోహర్ రెడ్డి, రషీద్, చిన్న వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

తాడిపత్రిటౌన్: గన్నెవారిపల్లి కాలనీలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా కాలనీవాసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జెడ్పీటీసీ రమణమ్మ, ఎంపీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, పట్టణ కన్వీనర్ జావీద్, యూత్ కన్వీనర్ ప్రదీప్, నాయకులు జేసీ సూర్యనారాయణ, ఆలూరు రామేశ్వరెడ్డి, వక్ఫ్ బోర్డ్ సెక్రటరీ బాబా, ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఉమ్మడి గురుప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బుక్కరాయసముద్రం: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం పరిశోధనా స్థానంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలన్నారు. రబీలో పంటల సాగుపై వివరించారు. జిల్లాలో వివిధ డివిజన్లలో పంటల సాగు స్థితిగతులపై తెలుసుకున్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం, శాస్త్రవేత్తలు అశోక్‌కుమార్, డాక్టర్ రాధిక, డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ దుర్గాప్రసాద్, సహదేవ, వెంకటరమణ, అప్పారావు, సుధీర్ రెడ్డిపల్లి, కళ్యాణదుర్గం, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

గన్నెవారిపల్లిలో తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగారావు

తాడిపత్రిటౌన్: గన్నెవారిపల్లి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని జెడ్పీటీసీ రమణమ్మ, ఎంపీడీఓ రంగారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఈ క్రాప్ బుకింగ్‌పై సోషల్‌ఆడిట్ గ్రామసభలు నిర్వహిస్తామని ఏఓ మహితాకిరణ్ తెలిపారు. సబ్సిడీ ద్వారా పశువులకు గ్రాసం, దాణా అందజేస్తున్నామని పశువైద్యాధికారి సుబ్బారెడ్డి తెలియజేశారు. పలు పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తోందని ఉద్యానవనశాఖ అధికారి ఉమాదేవి పేర్కొన్నారు. ఎంపీపీ సరస్వతి, వైస్ ఎంపీపీ స్రవంతి ఈఓఆర్‌డీ జిలాన్‌బాషా, సీఎస్‌డీటీ రాజ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యాధి సోకిన జీవాలను వేరుచేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులరెడ్డి

పుట్లూరు: వ్యాధి సోకిన జీవాలను తప్పనిసరిగా మంద నుంచి వేరు చేయాలని ప్యాపిలి గొర్రెల పెంపకం దారుల శిక్షణా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సన్నజీవాల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మందలో జాతి లక్షణాలు కలిగిన విత్తనపు పొట్టేలు ఉండేలా చూడాలన్నారు. గొర్రెల్లో పారుడు వ్యాధి, గాలికుంటు, చిటుక రోగం, బొబ్బ, నీలి నాలుక, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, నట్టల నివారణను వివరించారు. ఏడీ ఖదీర్ బాషా, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ నాగసువర్ణ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం

గుత్తి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంలాంటిదని చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్‌లు వరలక్ష్మి, పద్మలత పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 5వ సచివాలయ పరిధిలోని 9, 24వ వార్డుల్లోని ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు వరదరాజులు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: స్థానిక సత్యనారాయణ పేటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డీపీఎంఓ డాక్టర్ చెన్నకేశవులు శిబిరాన్ని ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సజీవ్, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ ఆస్మాపర్వీనర్, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ హరితలు సుమారు 402 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మెడికల్ రిపోర్ట్‌లను అందజేశారు. మున్సిపల్ మేనేజర్ రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: చిక్కేపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. డా.కళ్యాణ్‌కుమార్ రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మానాయక్, ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచు దివ్య తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: వడియంపేట సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు 612 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఎంపీపీ సునీత, వైస్ ఎంపీపీ రామగోపాల్, సర్పంచులు కొత్తపల్లి నాగిరెడ్డి, పొడరాళ్ల, ఎర్రిస్వామి, నాగార్జున, తహసీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నార్పల: మండల కేంద్రంలోని రెండవ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, సర్పంచు మన్నీల సుప్రియ, ఎంపీపీ నాగేశ్వరావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు అశ్వత్థంలో దర్శనం బంద్

పెద్దపప్పూరు: చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు అశ్వత్థనారాయణ స్వామి, భీమలింగేశ్వర స్వాముల దర్శనం బంద్‌చేయనున్నట్లు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యంలు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. పౌర్ణమి సందర్భంగా స్వామి కల్యాణోత్సవాన్ని శనివారం ఉదయమే నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం రాత్రి మూసి వేస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు తెలిపారు. ఆదివారం ఉదయం స్వామి దర్శనం ఉంటుందన్నారు.

వికలాంగులకు నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి అర్బన్: స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో వికలాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ భూమా సూర్యనారాయణ, వాసవీక్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, సభ్యులు వంకదారి పెద్దమద్దిలేటి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కందూరి సుబ్బరామయ్య, దివ్యాంగుల చైర్మన్ ఆరవీటి సుబ్బారావు, వాసవీ క్లబ్ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పోరాటం

గుంతకల్లు రూరల్: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా మాదిగలు పోరాటం కొనసాగించాలని మాదిగ దండోరా నాయకులు కోరారు. మాదిగ దండోరా ఆధ్వర్యంలో నవంబర్ 18న చలో హైదరాబాద్ చేపడుతున్న నేపథ్యంలో నాయకులు పలు గ్రామాల్లో దళిత వాడల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. మాదిగల విశ్వరూప సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు నరసింహులు, వెంకటేష్ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

గుంతకల్లు రూరల్: వర్షాభావంతో పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు నక్కనదొడ్డి కొట్టాల గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు.

మరమ్మతు పనులు తక్షణమే పూర్తి చేయండి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: అండర్ డ్రైనేజీ మరమ్మతు పనులు తక్షణమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. యల్లనూరు రోడ్డులోని బిందెల కాలనీలోని ఓపెన్ డ్రైనేజీ నీటిని అండర్ డ్రైనేజీలోకి వదులుతుండడాన్ని టీడీపీ కౌన్సిలర్లు బుధవారం రాత్రి అడ్డుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే అండర్ డ్రైనేజీ మరమ్మతు పనులను చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రంగంలోకి దిగిన కాంట్రాక్టర్లు పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పనులను పరిశీలించి ప్రజలకు అసౌకర్యం తలెత్తకుండా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ జి.రవి, సిబ్బంది, సీఐలు హమీద్‌ఖాన్, శంకర్‌రెడ్డి ఉన్నారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయండి

యల్లనూరు: ప్రతి నెలా కార్డుదారులకు రేషన్ సక్రమంగా అందించాలని తహసీల్దార్ సుమతి డీలర్లకు సూచించారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో డీలర్ల సమావేశం ఏర్పాటు చేశారు. సీఎస్‌డీటీ ఇంతియాజ్ , డీలర్లు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం



తుపాకులపై అవగాహన కల్పిస్తున్న కమాండెంట్ గంగాధర్‌రావు

బుక్కరాయసముద్రం: పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ గంగాధర్‌రావు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం 14వ ఏపీఎస్పీ పోలీసు బెటాలియన్ ఆధ్వర్యంలో రోటరీపురం ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల, జంతలూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పోలీస్ సేవలపై అవగాహన కల్పించారు. ఆయుధాలు ఎలా వాడాలో వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారిపై బెటాలియన్ బ్యాండ్ షో నిర్వహించారు. బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, బీకేఎస్ సీఐ నాగార్జున రెడ్డి, ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ఆర్‌ఐలు రాము, నాగేంద్ర, లోకేశ్వరనాయుడు, సీతారామారావు, ఆర్ ఎస్‌ఐలు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: పోలీసుల విధులపై శుక్రవారం అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఆయుధాలు, పరికరాలు, సాధనాల గురించి వివరించారు.

యల్లనూరు: యల్లనూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసులు తమ శాఖ పనితీరుపై అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కార్యక్రమం చేపట్టారు. ఏఎస్‌ఐ సంపత్ ఎఫ్‌ఐఆర్ నమోదు, స్టేషన్ రికార్డులు, పిస్టల్, వైర్‌లెస్ సెట్, మహిళా చట్టాలు, డయల్ 100 సేవలను వివరించారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఏఎస్‌ఐలు వెంకటేష్, రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ పాత పంప్‌హౌస్ పరిశీలన

గుంతకల్లుటౌన్: తిమ్మాపురం వద్దనున్న మున్సిపల్ పాత పంప్‌హౌస్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఈఈ గురప్పయాదవ్ పరిశీలించారు. పంప్‌హౌస్ నుంచి పట్టణంలోని వివిధ కాలనీలకు నీటిని సరఫరా చేసే మెయిన్‌పైప్‌లైన్, వినియోగంలో లేని విలువైన నీటి మోటార్‌ల గురించి వాటర్ వర్క్స్ సిబ్బందిని ఆరాతీశారు. పంప్‌హౌస్‌ను వినియోగంలోకి తీసుకొస్తే పట్టణ శివార్లోని పారిశ్రామికవాడ, మిల్లుఏరియా, పాతగుంతకల్లు తదితర ప్రాంతాలకు నీరందించే అవకాశంపై కమిషనర్ సంబంధిత అధికారులు, సిబ్బందితో చర్చించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బుక్కరాయసముద్రం: రెడ్డిపల్లి పంచాయతీలోని రేకులకుంట, అమ్మవారిపేటలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.